# ప్రేమ ఫలితం

రచన:
శ్రీ కె. వి. రమణ.

అది ఒక ఆనందకరమైన, విచారకరమైన సాయంతరం అని ఎందుకన్నానంటే నేనొక నిరుద్యోగిని గనుక. యిక ఆనందకరమైన సాయంతరం అని ఎందుకన్నానంటే నా స్నేహితుల లాడ్జింగ్ రూములో కూర్చున్నప్పుడు A, B, C, D అనే స్నేహితులు ఒక అందమైన అమ్మాయి గురించి వర్ణించారు గనుక.

నా స్నేహితుల రూముకి పోయి సాయంకాలంపూట కాలక్షేపం చేయటం (పురాణ కాలక్షేపం కాదు) నాకు అలవాటు. ఆ రోజున కాలేజీలో ఏదో మీటింగు ఉంది. ఈ తాళం సహాయంతో రూము తెరచి కూర్చో అని నా స్నేహితులనడంచేత వారిని గురించి ఎదురు చూస్తున్నాను వాళ్ళ రూములో కూర్చుని.

నేను రూములో కూర్చున్నాను. నా వెనుకభాగం వైపు వారు రావటానికిగాను ద్వారం వుంది. అయితే మీరొక ప్రశ్న వేయవచ్చు-నీవు వారినిగురించి ఎదురు చూచుచున్నావని వ్రాశావు. ద్వారంవైపు వీపుపెట్టి కూర్చున్నా వాళ్ళు వచ్చినట్లయితే శబ్దం అవుతుందిగా? నా చెవులు మాత్రము వారిగురించి యెదురు చూస్తున్నాయి. అదేలాసాధ్యం అని ప్రశ్నిస్తే, ఆ విషయం అంతే మరి.

ఇంతలో అడుగుల చప్పుడుబట్టి, మాట్లాడుకునే మాటలుబట్టి వాళ్ళేనని నిర్ణయించుకున్నాను. వాళ్ళు వచ్చీ రావడంతోనే అందులో ఒకడు 'ఒరేయ్! రమణా!' అని పిలిచాడు.

నేను మాత్రం పలకలేదు. నేనొక అమాయకుడ్నని వారికి బాగా తెలుసు. వారు నన్ను అప్పుడప్పుడు ఏడిపిస్తు వుండటంకూడ జరుగుతుంటుంది. వారు అప్పుడప్పుడు నన్ను ఏడిపించటానికి పిలిచి ఉంటారని నేనూహించుకున్నాను. అందువలన నేను పలకనూ లేదు, వెనక్కు తిరిగి చూడనూలేదు, నేను పలక్కపోవడం చూచి వాళ్లు నా గురించి ఏమనుకున్నారో ఏమో, పైకి వెళ్ళిపోయారు. కొద్ది సేపయిన తరువాత మళ్ళీ లోపలికి వచ్చి వాళ్ళల్లో వాళ్ళు అనుకోసాగారు,

'అబ్బ! ఎంతో అందంగా వుందని?' A అన్నాడు.

'అబ్బ! ఎంత అందంగా వుందని?' దానిని B సమర్థించాడు.

'ఆహాహాహా!' అన్నాడు C.

'ఓహోహోహో' అన్నాడు D.

నాకు తెలుసు వాళ్ళు ఎందుకు అంటున్నారో. నేను గట్టిగా నవ్వేశాను.

A సీరియస్‌గా అన్నాడు-' ఒరేయ్! నీవు ప్రతిదానికీ అలా అట్టహాసంగా నవ్వకు. ఇందాక నిన్ను పిలిస్తే పలకలేదు. మా కాలేజిలోని వొక అందమైన అమ్మాయి యిటు వైపే వెళ్ళిపోయింది. ఆమెను నీకు చూపిద్దామని మేం అనుకున్నాం.'

'నాకెందుకు చూపించడం?' నేనుగూడ సీరియస్‌గానే అడిగాను.

'అలా అడుగు చెప్తాను. అన్నాడు. 'నీవు ఆమెను ప్రేమిస్తావేమోనని' వాక్యం పూర్తిచేశాడు.

ఇప్పుడు నాకు బాగా నమ్మకం కలిగింది. వాళ్ళందరూ నన్ను వేళాకోళం చేయడానికే పూనుకున్నారని. నేను అన్నాను-'మీరందరూలేరా ఆమెను ప్రేమించడానికి?'

B అంటున్నాడు - 'అలా ప్రశ్నించవోయ్, నే సమాధానం చెప్తాను. మేం అందరమూ కాలేజీలో చదువుకుంటున్నాం. ఇటువంటి ప్రేమలో పడినట్లయితే మా చదువు బాగుపడినట్లే! అంతేగాకుండా ప్రేమించడానికిమాకు మరి టైం ఎక్కడది? నీవేమో ఖాళీగా కూర్చున్నా, నిరుద్యోగివి. నీవు తీరికగా ప్రేమిస్తావేమోనని చెప్తున్నాం.'

వాళ్ళ మాటలు వింటుంటే నిజంగా నాకు నమ్మకం కలిగింది-వాళ్ళు చెప్పింది నిజమేనని, వేళాకోళం చేయటంలేదని.

D అన్నాడు - 'నిన్ను ఆమె తప్పక ప్రేమిస్తుంది. ఇందులో మరి సందేహంలేదు. నీకేం, అందం తక్కువనా? పైగా గేయకవికూడా!'

వాళ్ళ మాటలకి పొంగిపోయినట్లు కనిపిస్తే మరీ డబ్బాకొడతారు. అందుకనీ లోపల వొప్రక్క అంత సంతోషంగావున్నా (వొకానొక అపరిచిత అందమైన

కాలేజీ యువతి (ప్రేమించడానికి సిద్ధంగా వున్నదని) సీరియస్‌గా ఫోజు పెట్టి వుండిపోయాను. మరి నా ఫోజు చూసి వారు నిశ్శబ్దంగా వుండిపోయారు.

మర్నాడు నేను యథాప్రకారంగానే కూర్చున్నాను. నా స్నేహితులైన A, B, C, D లు మాట్లాడుకుంటూ గదిలో ప్రవేశించారు. C అన్నాడు-'ఒరేయ్ రమణా! ఇప్పుడు చూడరా, ఆ అమ్మాయిని. ఎంత అందంగా వుందని, రోడ్డుమీద వెళ్ళిపోతుంది, వేగంగా చూడు.'

మొదటి రోజున వాళ్ళమాటలు వింటుంటేనే ఆమెను చూడాలనే ఆత్రుతపుట్టింది. వెంటనే ద్వారంవద్దకు వెళ్ళి చూశాను. అప్పటికే ఆమె ప్రక్క సందులోనికి తిరిగి పోతుంది. ఆమె దుస్తులు బావున్నాయి, దుస్తులు ధరించిన రీతిగూడా బాగానేవుంది. ఆమె ముఖం మాత్రం నాకు కనబడలేదు. అయినప్పటికీ ఆమె అందంగానే వుంటుంది అని నిర్ణయించుకున్నాను. ఆమె పేరునుబట్టి కూడా ఆమె అందాన్ని నిర్ణయించుకోవచ్చుననే వుద్దేశంతో D ని ఆమె పేరు గురించి అడిగాను. పేరు చెప్పాడు. అబ్బ ఎంత అందంగా వుందని, ఆమె పేరు తలంచుకుంటే ఎంత ఆనందంగా వుందని, అన్నంతిన బుద్దెయ్యటంలేదు (ఆకలివేస్తే తినొచ్చు). ఆమెపేరు కటవరేకుల కోమల లలిత. బావులేదూ?

తప్పకుండా ఆమెను ప్రేమించితీరాలి. ఈ విషయం A, B, C, D లకు తెలియకూడదు. కాని వారిసహాయం లేనిదే ఏపనీ పూర్తికాదే? సరే, వారినే ఆశ్రయించాలి. స్నేహితుడనైన నన్ను వేళాకోళంచేస్తే ఆ పాపం వారిదే. చచ్చి నరకానికి పోతారు. తరువాతి జన్మలో ఏ కుక్కగానో, నక్కగానో, చీమగానో, దోమగానో పుడతారు.

ఇక ఆరోజు రాత్రంతా ఒక్కటే ఆలోచనలు. ఒకటే అనేది ఏకవచనం, ఆలోచనలు అనేది బహువచనం-ఏమిటయ్యా యీ పదప్రయోగం? అని మీరనకొచ్చు. ఇక్కడ 'ఒకటే' అంటే 'ఎడతెరిపిలేని, (ఆలోచనలు) అని అర్థం.

ఆమె తండ్రి ఏ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసరో అయి వుంటే బావుంటుందనుకున్నాను. ఎందుచేతనంటే ఆమెను ప్రేమించబోయే నాకు వెంటనే ఉద్యోగం దొరుకుతుంది.

ఆమె తండ్రి ఏమినిష్టరో అయితే చాలా బావుంటుందనుకున్నాను. అలా అయినట్లయితే ఏ పబ్లిక్ సర్వీస్ కమీషనుకో మెంబరుగా అయే అవకాశముంది. అప్పుడు లంచాల్ని గుప్తంగా పుచ్చుకోవచ్చు.

ఆమె ఓ సినిమా స్టారు అయితే బావుండును. ఆమెతోపాటు నాకుకూడ అదృష్టం కలిసివస్తుంది. నేను హీరోనయే అవకాశం లభిస్తుంది.

ఇటువంటి ఆలోచనలతో సగం రాత్రివరకూ నిద్ర పోలేదు. తరువాత నిద్రపోయాను. నిద్రలోగూడ ఆమె గురించే కలలు, ఆమె చేయి పట్టుకుని బీచికి వెళ్తున్నట్టు ఓ కల. అందరూ మమ్మల్ని చూసి ఆశ్చర్య పోయేవారు. నా నలుగురు స్నేహితులు A, B, C, D లు మమ్మల్ని అవమానపరచబోయి వారే అవమానం పోయారు.

మరో కల. నేను పై వూరు వెళ్ళాను. ఆమె నా గురించి యెదురుచూస్తుంది. ఎదురు చూసిచూసి ఆమె అలసిపోయింది. కాళిదాసుగారి మేఘంతో అంటుంది-నా భర్త వేగంగా వచ్చేటట్టు చెయ్యి.' నలుని హంసతో అంటుంది. నేను యిక్కడ మదన పడుతున్నానని చెప్పు నా భర్తతో.' అది హంస కాదనుకోండి! చెరువులో తిరిగేబాతు. సందేశం అందజేయడానికి ఏదో ఒకటి హంసలు లేనిచోట బాతులే హంసలు, ఇంతగా చేసినప్పటికీ ఆమె విచారం తగ్గదు, ఆమె ఆతృత తగ్గదు. అప్పుడామె విచారంతో దేవుడిముందు కూర్చొని పాట పాడుతుంది. వెనక భాగంనుండి సన్నగా మ్యూజిక్ (సినిమాలలోవలె) వినిపిస్తూ ఉంటుంది.

ఈ విధమయిన కలలలో తెల్లారిపోయింది.

మధ్యాహ్నం బాగా ఆలోచించి కొన్ని గేయాలు వ్రాశాను ఆమె మీద. ఆమెను కలుసుకోవటానికి కాలేజికి వెళ్ళాను. కాలేజీ గేటువద్ద మా స్నేహితుల గురించి నిరీక్షించాను. కాలేజీ వదలిపెట్టేశారు. మా స్నేహితులు బయటకు వచ్చారు. నేను అక్కడ హాజరు కావటం చూసి ఆశ్చర్యపోయాను-'ఏంవోయ్! ఏమిటలా కాలేజీకి అమాంతంగా వచ్చేశావ్?' అన్నారు. 'ఊరికినే వచ్చాను అన్నాను.' వాళ్ళతోపాటు కాలేజీనుండి బయలుదేరాను. మనస్సులో ఆమెను కలుసుకోవాలనే

కుతూహలం యెక్కువ కాసాగింది. ఎలా? ఆమె ముఖపరిచయం కూడా లేదే!

వొంటరిగా పోతున్న ఒక స్త్రీని చూపించి, ఆమే కలువరేకుల కోమల లలిత అని నా స్నేహితు లన్నారు. మరి ఆమెను ఎలా కలుసుకోవడం యీరోజున ప్రక్కన స్నేహితులుండగా? ఏదో బజారులో పనుందని నా స్నేహితులు అక్కడినుండి తప్పుకున్నారు. మనస్సులో వారికి ధన్యవాదాలర్పించాను - ఆమెతో మాట్లాడేటందుకు నాకు సదవకాశం కల్పించినందుకు.

ఆమె వోసందులోనుండి వెళ్తూ వుంది. వెనుకా ముందూ ఎవరూలేరు. ఇదే మంచిసమయం అనుకున్నాను. అప్పటికింకా ఎడంగానేవుంది. ఆమెగురించి కొన్ని గేయాలు వ్రాశానని మీకు చెప్పాను. ఆ కాగితాలు నాదగ్గరనే వున్నాయి. వాటిని జేబులోనుండి బయటికి తీశాను. ఆమెవెనకగావెళ్లి చదువసాగాను ఆ గేయాల్ని.

"మధురం మధురం
రాగాలాపం,
కమనీయం నీ
ముఖారవిందం!"

(ఆమెముఖం చూడకపోయినా, కంఠస్వరాన్ని వినకపోయినా నేనలా వూహించుకొని వ్రాశాను.)

"క్రమక్రమమ్ముగా కలిసినవి,
నీ కాటుక కన్నులతో నావి,
చూచుకొందు నా ప్రతిబింబమె,
నీ కనులలో నా కనులతోనె."

ఇక గేయాలు చదవటం అయిపోయింది. వచనం చదవటం ప్రారంభించాను. 'ఈ చల్లటి వెన్నెల రేయిలో పూదోటలో మనమిద్దరం వొంటరిగా జంటగా తిరుగుతుంటే మన శరీరాలు పులకించవూ?'

ఇలా చదివి ఆమెవైపు వోసారి చూశాను. ఇంకేముంది ఆమెకూడా నావైపే చూస్తూ నవ్వుతుంది. నాగుండెలు జోరుగా దడదడ బడబడ కొట్టుకున్నాయి. గుండెల్లో పునశ్శబ్దం 'దడదడ' పైకిమాత్రం 'బడబడ' అనేశబ్దం వినిపిస్తుంది. నేను అమాయకుడ్నికదా? నా గుండెల శబ్దం బయటికి అలానే వినిపిస్తుంది. ఆమె గురించి వర్ణించడం ప్రస్తుతం చాల అవసరం.

ఆమె తెల్లగానూ, నల్లగానూ వుంటుంది. తెల్ల కనుపాపగలవారు చూస్తే తెల్లగానూ, నల్లకనుపాపగలవారు చూస్తే నల్లగానూ ఆమె కనుపిస్తుంది. ఆమె పొట్టిగానూ, పొడుగుగానూ వుంటుంది. పొడవుగా వున్నవారు చూస్తే ఆమె పొట్టిగానూ, పొట్టిగా వున్నవారు చూస్తే ఆమె పొడవుగాను కనిపిస్తుంది. ఆమె ముఖం అందంగానూ, కురూపంగాను వుంటుంది. అందంగా వుండేవారు చూస్తే ఆమె ముఖం కురూపంగానూ, కురూపంగా వుండేవారు చూస్తే అందంగానూ కనిపిస్తుంది. ఆమె తలవెంట్రుకలు వొత్తుగానూ, పల్చగానూ వుంటాయి. తలవెంట్రుకలు వొత్తుగానున్నవారుచూస్తే ఆమె తలవెంట్రుకలు పల్చగానూ, టైఫాయిడ్ పడ్డవాళ్ళుచూస్తే వొత్తుగానూ కనిపిస్తాయి.

ఇదీ ఆమె వర్ణన. ఎవర్ని ప్రేమించినా అంతస్థు చూసుకుని ప్రేమించాలంటారు పెద్దలు. ఇక్కడ పెద్దలంటే నా స్నేహితులని అర్థం.

నేనామెకు అయోగ్యుడనని ఋజువయింది. అందుచేత ఆ గేయాలు వ్రాసిన కాగితాన్ని ఆమె ముఖంమీద పారేసి, వెనుదిరిగిచూడనైనా చూడకుండా మా స్నేహితులుంటారేమోనని వాళ్ళరూములోనికి వెళ్ళాను. తలుపు తాళం వేసివుంది. నా తలమీద చేతులు పెట్టుకుని అరుగుమీద కూర్చుండిపోయాను.


ఏజెంట్లు కావలెను

మా అత్యుత్తమమైన సిల్కు, & కాటన్ కార్పెట్స్ గ్యారంటి రంగుగల బెడ్ షీట్లకు, ఆర్డరు బుక్ చేయుటకు కమిషన్ ఏజెంట్లు కావలెను.

— వివరములకు నేడే వ్రాయండి. —

THE VALLUVAR TEXTILES
JAMBAI (PO)—Branch: BHAVANI (S. I.)